సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నీలమాంబేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



అల్లిపురం: యాతపేటలో వెలిసిన శ్రీ నీలమాంబేశ్వరి అమ్మవారి 123 ఏళ్ల పండగ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 15వ తేదీన సత్తమ్మతల్లికి కుంభం సమర్పణ, 16న మరిడమ్మ తల్లి పూజ, 17న అమ్మవారి జలాభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కెప్టెన్ రామారావు జంక్షన్ సదనం పట్టు నుంచి పవిత్ర జలాలతో నిండిన కళశాలతో భారీ ఊరేగింపుతో అమ్మవారి దేవాలయానికి చేరుకుని అక్కడ అమ్మవారి నూతన విగ్రహానికి అభిషేకం చేయనున్నట్లు తెలిపారు. 17న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, 18వ తేదీన అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు వైభవంగా చేపట్టనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

రూ.9వేలు పెన్షన్ అమలు చెయ్యాలి



మాట్లాడుతున్న ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్

సీతంపేట: ఆల్‌ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్‌ఈనెల 11న ఢిల్లీలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీఆర్‌పీఏ (ఆప్రా) విశాఖ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆప్రా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలుతో పాటు, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దీనబంధు జిల్లా ఉపాధ్యక్షుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ, రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు, సెయిల్ నాయకులు ఎ.నారాయణరావు, ఆర్టీసీ నాయకులు తులసీరామ్, కమిటీ సభ్యులు కె.ఎం.కుమార్ మంగళం, పట్నాయక్, రాము, కె.వెంకట రమణారావు పాల్గొన్నారు.

క్యూబా సాలిడారిటీ డే

డాబాగార్డెన్స్: నగరంలోని డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మంగళవారం 'క్యూబా సాలిడారిటీ డే' నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఏఐబీడీపీఏ నాయకులు, సిటూ నాయకులు మణి, అష్రఫ్, రామాంజనేయులు, శ్యామల, కృష్ణవేణి, శ్రీనివాస్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఈసీహెచ్‌వీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు అభినందనలు



విద్యార్థినులను అభినందిస్తున్న శ్యామల దీపిక, రమణారావు

సీతంపేట: ప్రభుత్వ మహిళా ఐటీఐ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విద్యార్థినులు ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా లోకేజిట్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శిక్షణ పూర్తి చేసుకుని రూ.3.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. వీరిని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.రమణారావు, ట్రైనింగ్ ఆఫీసర్ శంకరరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమికి గంగవరం ముస్తాబు



మాఘ పౌర్ణమి సందర్భంగా ఏర్పాట్లు

పెదగంట్యాడ: మండలంలోని గంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామం మొత్తం ముస్తాబైంది. పాత గంగవరంలో వేంచేసియున్న మాధవస్వామి మహాలక్ష్మి తీర్థాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి గంగవరం గ్రామస్తులు జాగరణ చేశారు. మహాలక్ష్మీ మాధవస్వామి తీర్థాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాగరణ అనంతరం భక్తులంతా బుధవారం వేకువ జామున పాత గంగవరం తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి ఆపై మహాలక్ష్మి మాధవస్వామిని దర్శించుకోనున్నారు.

విద్యార్థులే లోకం.. పాఠశాలే జీవితం

శిల్పి తన నైపుణ్యంతో బండరాయిని..శిల్పంగా తీర్చిదిద్ది కనువిందు చేస్తాడు. గురువు తన నైపుణ్యంతో విద్యార్థికి అక్షర సత్యాలను రంగరించి మంచి నడవడికను, నడతను నేర్పించి..ప్రగతి బాటలో నడిపించి..ఎనలేని ఆనందాన్ని చవిచూస్తాడు. ఈ పాఠశాల్లో గురువులను చూస్తే అచ్చం ఇదే గుర్తుకు వస్తుంది. విద్యార్థుల భవితకు వారు చేస్తున్న 100 రోజుల యజ్ఞం స్ఫూర్తిగా నిలుస్తోంది. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి కీలకం..వారిని విజయ పథంలో నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. వారికి తల్లిదండ్రులు బాసటగా నిలుస్తున్నారు. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు అదనపు తరగతులు నిర్వహిస్తుంటే..విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనాలు తల్లిదండ్రులే సమకూర్చుతూ శభాష్ అనిపించుకుంటున్నారు. పదింతలు స్ఫూర్తినిస్తున్న ఆ పాఠశాల గురించి తెలుసుకుందాం.

– డాబాగార్డెన్స్

'సాధారణంగా టీచర్ బోధిస్తాడు.. మంచి టీచర్ వివరిస్తాడు.. ఉత్తమ ఉపాధ్యాయుడు ప్రభావితం చేస్తాడు'



జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల



విద్యార్థులకు స్నాక్స్, టిఫిన్స్ సిద్ధం చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయిని

స్ఫూర్తి చాటుతున్న ప్రకాశరావుపేట జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు

పదో తరగతి విద్యార్థులకు అలుపెరుగని బోధన

విద్యార్థులకు స్నాక్స్, భోజనం సమకూరుస్తున్న తల్లిదండ్రులు

తల్లిదండ్రుల విజ్ఞప్తితో రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక తరగతులు

జీవీఎంసీ పరిధిలో అనేక సర్కార్ బడులున్నాయి. వీటిలో వేలాది మంది పేద విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నియోజకవర్గం విషయానికొస్తే..ఎంజీఎం హైస్కూల్, ఎంవీడీ దండుబజార్, ఎంవీడీఎం (లక్ష్మీటాకీస్) హైస్కూల్..పాతనగరం పాతపోస్టాఫీస్ వద్ద ప్రభుత్వ క్వీన్‌మేరీ పాఠశాలతో పాటు జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల కూడా ఉంది. ఈ పాఠశాల్లో పదో తరగతి పరీక్షలకు 88 మంది పిల్లలు హాజరుకానున్నారు. వీరిలో 46 మంది బాలురు కాగా..42 మంది బాలికలు. వీరంతా పేద బడుగు బలహీన వర్గాల పిల్లలే. ఈ పిల్లల తల్లిదండ్రులు కూలీ పనులు.. చిరు వ్యాపారాలు చేసుకుంటున్నవారే.

అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ముగుస్తాయి. ప్రభుత్వ సూచనల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ప్రకాశరావుపేట పాఠశాల మాత్రం ఇందుకు భిన్నం. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రాత్రి 8 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు పత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఏ మాత్రం విసుగు లేకుండా ఎంతో ఓపిగ్గా..విద్యార్థులందరూ శతశాతం ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదునిస్తున్నారు. ఈ పాఠశాల్లో చదువుతున్నవారంతా పేద, మధ్యతరగతి విద్యార్థులే కావడంతో తల్లిదండ్రులంతా కలిసి వారికి సాయంత్రం వేళ స్నాక్స్, రాత్రి భోజనం సమకూరుస్తున్నారు.

తల్లిదండ్రుల విజ్ఞప్తితో..

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటే..ఈ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల అంగీకారం..సహకారంతో రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక బోధన అందిస్తుండడం గమనార్హం. చాలా మంది ఉపాధ్యాయులు..పాఠశాల ముగిసిన వెంటనే ఇంటికి వెళ్లిపోదామనుకుంటారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థుల చదువే ముఖ్యంగా విద్యనందిస్తుండడంతో అభినందనీయం.

ప్రభుత్వం సహకరించకపోయినా..

ప్రత్యేక తరగతుల విషయంలో పాఠశాల విద్యార్థులకు సాయంత్రం వేళల్లో గత ప్రభుత్వం స్నాక్స్ అందించేది. పిల్లలు కొంత ఉపశమనం పొందేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పథకాన్ని ఎత్తేశారు. ప్రభుత్వం స్పందించకపోయినా..పిల్లల తల్లిదండ్రులు వారి సొంత డబ్బులతో సాయంత్రం వేళ స్నాక్స్..రాత్రి వేళల్లో భోజనం పెట్టడం విశేషం. తల్లిదండ్రుల సహకారానికి ఉపాధ్యాయులు కూడా పిల్లలకు విద్యనందిస్తూ..విద్యార్థులకు ఉన్నతికి బాటలు వేస్తున్నారు.



హిందీ సబ్జెక్ట్‌ను బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పిల్లల ఉన్నత చదువుల కోసం ఉపాధ్యాయుడిగా.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా నిత్యం కృషి చేస్తుంటాం. పిల్లలు విద్యలో రాణించాలన్నదే మా లక్ష్యం. పదో తరగతి పరీక్షల్లో మా పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల అంగీకారంతో రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు అందిస్తున్నారు. విద్యార్థులకు వేళల్లో స్నాక్స్..భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయం. గతేడాది 99 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

– **శ్రీనివాసరావు**, ప్రధానోపాధ్యాయుడు, **జీవీఎంసీ** ప్రకాశరావుపేట పాఠశాల

గణితంలో సులువుగా..



మా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నదే మా తపన. ఇక్కడ చదివే పిల్లలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించేలా తర్ఫీదునిస్తున్నాం. మ్యాథ్స్‌లో 14 చాప్టర్లుంటాయి. 6 చాప్టర్లపై గట్టి పట్టు ఉంటే సులువుగా 60 మార్కులు సాధించవచ్చు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.

– **డి. శ్రీనివాస్, గణిత** ఉపాధ్యాయుడు

హిందీ కష్టం కాదు



హిందీ సబ్జెక్ట్ టఫ్ కానే కాదు. ప్రణాళికా ప్రకారం వెళ్తే పదో **తరగతి** పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థి సులువుగా మంచి మార్కులు పొందవచ్చు. ఆ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. మా పాఠశాల విద్యార్థులు 90కి పైగా మార్కులు సాధిస్తారన్న గట్టి నమ్మకం ఉంది.

– పద్మ, హిందీ సబ్జెక్ట్ ఉపాధ్యాయురాలు

10 పాయింట్లు సాధిస్తా..



తండ్రి మల్లేష్ కూలి. తండ్రి గృహిణి. చాలీచాలని ఆదాయం. కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత అమ్మానాన్నకు లేదు. ఈ పాఠశాలలో చేరినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఉపాధ్యాయులు మా ఉన్నతికి ఎంతో శ్రమిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మాకు అర్థమయ్యే విధంగా శిక్షణ ఇస్తున్నారు. తొమ్మిదో తరగతిలో 600 మార్కులకు 548 వచ్చాయి. పదో తరగతి పరీక్షల్లో 10కి 10 గ్రేడ్ పాయింట్లు సాధిస్తా..టాపర్‌గా నిలవాలన్నదే నా కోరిక.

– **రోహిణి**, పదో తరగతి విద్యార్థి, జీవీఎంసీ–ప్రకాశరావుపేట పాఠశాల

ప్రత్యేక తరగతులు ఓ వరం



ప్రత్యేక తరగతులు మాకు ఓ వరం. వచ్చే నెలలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించేందుకు మంచి తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలకు ఇప్పటికే సిద్ధంగా ఉన్నా. ఈ నెల రోజులు మరింత బాగా కష్టపడి మంచి మార్కులు సాధిస్తా. నాతో పాటు..తోటి విద్యార్థుల ఉన్నత చదువులకు పదో తరగతి ఓ ప్లాట్‌ఫాం. ముఖ్యంగా మాకు సహకరిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు

– **ఆర్.లక్ష్మీ ప్రణీత**, పదో తరగతి విద్యార్థి

పట్టుదలతో చదువుతుంటే ముచ్చటేస్తుంది



పిల్లల తపన చూస్తుంటే ముచ్చటేస్తోంది. పేదరికంలో ఉన్నా పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్న వారి పట్టుదల స్ఫూర్తిగా నిలుస్తోంది. ఉపాధ్యాయులు కూడా ఎంతో ఓపిగ్గా విద్యాబోధన చేస్తున్నారు. ఈ రోజు మా బాబు జగదీష్ పుట్టినరోజు.. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బాబు పేరిట పిల్లలకు రాత్రి భోజనం సమకూర్చా..

పి.సత్యవతి, గృహిణి

విద్యార్థినులకు క్రీడా కిట్ల పంపిణీ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు

అల్లిపురం: మహాత్మాగాంధీ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి నాంది ఫౌండేషన్ ప్రతినిధి చాప జయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీవీఎస్ నాగభూషణం చేతులు మీదుగా 80 మంది క్రీడాకారులకు అందజేశారు. నోటు పుస్తకాలు, స్పోర్ట్స్ పరికరాలు, శానిటరీ నాప్‌కిన్స్, పెన్నులు, పెన్సిల్స్, టీషర్టు ఉన్నాయని నాంది ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ స్కిల్ ట్రైనర్ వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే స్కూల్‌లో..

రైల్వే క్వార్టర్స్‌లో గల ఉన్నత పాఠశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి నాంది ఫౌండేషన్ ప్రతినిధి చాప జయలక్ష్మి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు పి.సుధ చేతులు మీదుగా 86 మంది క్రీడాకారులు అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ అసోసియేట్ ట్రైనర్ ఉప్పాడ మోహిని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై పీఆర్‌సీ బృందం సమీక్ష



డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర పీఆర్‌సీ బృంద సభ్యులు

మహారాణిపేట: ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణకు ఢిల్లీ నుంచి వచ్చిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్(పీఆర్‌సీ) కేంద్ర బృందం విశాఖ చేరుకుంది. ఈ బృందంలో సభ్యులు డాక్టర్ పాదాలు, రమణ 5 రోజులు పాటు విశాఖలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, ఆరోగ్య కార్యక్రమాలను డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బృంద సభ్యులకు వివరించారు. మధ్యాహ్నం కంచరపాలెం, దొండపర్తి తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది, కార్యాలయ సిబ్బంది హాజరు పరిశీలించి తగు సూచనలు చేశారు. సమావేశానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజల జీవనం మెరుగుపడాలి



మాట్లాడుతున్న ఆచార్య రాజు

విశాఖ విద్య : గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు అన్నారు. ఏయూ రాజనీతి – ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్' జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛ అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు. వీటిని పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సదస్సులో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య పి.ప్రేమానందం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.అనిల్ కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా నీలమాంబ పరస



ఎస్‌కేఎమ్ఎల్ డ్యాన్స్ గ్రూప్‌చే కాళీ నృత్యాలు



జాతరలో బొమ్మల సందడి



నీలమాంబ అమ్మవారు

డాబాగార్డెన్స్: పాతనగరం 36వ వార్డు రంగిరీజువీధిలోని నీలమాంబ 43వ పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. రంగిరీజువీధి, పూలసందు, ఏవీఎన్ కాలేజ్ డౌన్, గొడారిగోతులు, వెలంపేట, లక్ష్మీనగర్, కర్రలదొడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం 3 గంట నుంచి చిన వాల్తేర్‌కు చెందిన ఎస్‌కేఎమ్ఎల్ డ్యాన్స్ గ్రూప్‌చే కాళీ నృత్యాలు, పులివేషాలు, కింగ్‌కాంగ్, గాడ్జిల్లా బొమ్మల ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి నీలమాంబ మహిళా భక్త సమాజం సౌజన్యంతో ఆలయ ఆవరణలో సేవా గరిడి నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మాసిపోగు రాజు సంయుక్త ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డులో గల పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు వద్ద నిర్వహించారు. అలాగే రంగిరీజువీధి క్రేజీబాయ్స్ సౌజన్యంతో మెయిన్‌రోడ్డు వద్ద ఎంవీపీ కాలనీకి చెందిర రమేష్ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేశారు. సాయంత్రం 7 గంటల నుంచి చింతల నాగభూషణరావు, చింతల శేషగిరిరావు సౌజన్యంతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పరస ఉత్సవంలో భాగంగా ఈ నెల 16న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించనున్నట్లు నీలమాంబ సేవా సమాజం కమిటీ తెలిపింది.

కేజీహెచ్‌లో ట్రాఫిక్ నరకం



కేజీహెచ్‌లో రోగులను వార్డుకు తరలించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కేజీహెచ్‌లో ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రిలో పలు విభాగాలకు కీలకమైన ప్రాంతం రద్దీగా ఉండడంతో రోగులను తరలించేందుకు శ్రమించాల్సి వస్తోంది. ఆస్పత్రి పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయవలసిన ప్రైవేటు సెక్యూరిటీ ఆచూకీ లేకపోవడంతో సమస్య జటిలంగా మారింది. ఇప్పటికైనా కేజీహెచ్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com